



sahanamvande.com
epaper.sahanamvande.com


# సహానం వందే

హైదరాబాద్ | 28-07-2026 మంగళవారం | సంపుటి-02 సంచిక : 113 EDITOR: ROHINI




# టిక్‌టాక్ డాక్టర్ తింగరి వైద్యం

## కోకోకోలాలో ఉల్లి కలిపి తాగితే యంగ్ లుక్



ఇంటర్నెట్ ప్రపంచంలో నకిలీ వైద్యం పడగ విప్పుతోంది. కృత్రిమ మేధతో సృష్టించిన నకిలీ వైద్యులు టిక్‌టాక్‌లో తప్పుడు ఆరోగ్య సలహాలను ప్రచారం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ దారుణమైన పరిస్థితిపై నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - సహానం వందే, హైదరాబాద్

- ఫోన్ పక్కన నిద్ర పోతే క్యాన్సర్ వస్తుందట
- ఏఐ సాయంతో 84 శాతం నకిలీ చిట్కాలు
- ఐదుగురిలో ఒకరు నకిలీలను నమ్మేస్తున్నారు
- నకిలీ ఆరోగ్య కంటెంట్‌ను కుమ్మరిస్తున్నారు

కృత్రిమ మేధతో సృష్టించిన నకిలీ వైద్యుల ఖాతాలు టిక్‌టాక్‌లో కోట్లాది వ్యూస్‌ను సాధిస్తున్నాయి. ఇంగ్లాండ్‌లోని హ్యాలమ్ డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీ ఈ నెలాఖరులో ఈ పరిశోధనను ప్రచురించింది. టిక్‌టాక్‌లో అత్యధికంగా చూసిన ఆరోగ్య సంబంధిత వీడియోలలో 40 శాతం మేర కృత్రిమ మేధ సృష్టించిన కంటెంటే కనిపిస్తోంది. ఆరోగ్య చిట్కాలు అనే పదాన్ని వెతికినప్పుడు 84 శాతం వీడియోలు కృత్రిమ మేధతో కూడినవే ఉన్నట్లు తేలింది. ఈ నకిలీ వైద్యులు సగటున 25 లక్షల వ్యూస్‌ను దక్కించుకుంటున్నారు.

### ప్రాణాంతక క్యాన్సర్ అబద్ధాలు

ప్లాస్టిక్‌లో ఆహారాన్ని వేడి చేయడం, డియోడరెంట్లు వాడడం, ఫోన్ పక్కన పెట్టుకుని పడుకోవడం వల్ల క్యాన్సర్ వస్తుందంటూ ఈ నకిలీ ఖాతాలు ప్రచారం చేస్తున్నాయి. క్యాన్సర్ రీసెర్చ్ యూకే సంస్థ ఈ నిరాధార వార్తలను పూర్తిగా ఖండించింది. ఆన్‌లైన్ ఆరోగ్య తప్పుడు సమాచారం ప్రజారోగ్యానికి నిజమైన ముప్పు అని ఎన్‌హెచ్‌ఎస్ హెచ్చరించింది. బ్రిటీష్ మెడికల్ అసోసియేషన్ కౌన్సిల్ డిప్యూటీ చైర్ డాక్టర్ ఎమ్మా రన్విక్ మాట్లాడుతూ ఈ నకిలీ ఖాతాలు వైద్య వదంతులను, అద్భుత నివారణలను ప్రచారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న టిక్‌టాక్ వంటి వేదికలు దీనిని ఆపాలని ఆమె హెచ్చరించారు.

### విచిత్రమైన నకిలీ చిట్కాల మోసం

ఈ నకిలీ ఖాతాలు రకరకాల ఆరోగ్య సమస్యల కోసం కోకోకోలాలో ఉల్లిపాయ కలిపి తాగడం వంటి విచిత్రమైన నివారణలను ప్రచారం చేస్తున్నాయి. హయాలేథినాప్ ప్లస్ ప్రో మాక్స్ అనే నకిలీ యాంటీ ఏజింగ్ ఉత్పత్తిని కూడా ఇవి సిఫారసు చేశాయి. జుట్టు రాలడం, చర్మం బలహీనపడటం, గోర్లు విరగడం, కీళ్ల నొప్పులను తగ్గిస్తుందని ఒక ఏఐ అవతార్ చెప్పుకొచ్చింది. అయితే ఆన్‌లైన్‌లో ఈ ఉత్పత్తికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు.

### పరిశోధన వెల్లడించిన భయానక నిజాలు


హ్యాలమ్ సంస్థ మొత్తం 1198 వీడియోలను విశ్లేషించింది. ఆరోగ్య చిట్కాలు, వైద్యుల సలహాలు వంటి కీలకమైన పదాలతో పాటు వ్యక్తిగత ఆర్థిక వృద్ధి, విద్య వంటి అంశాలపై టాప్ 50 వీడియోలను పరిశీలించింది. యూనివర్సిటీ కాలేజ్ లండన్ ఆరోగ్య తప్పుడు సమాచార పరిశోధకుడు అలెక్స్ రువానీ మాట్లాడుతూ కృత్రిమ మేధ వైద్యుల వీడియోలు నకిలీ ఆరోగ్య కంటెంట్‌ను విపరీతంగా పెంచుతున్నాయని తెలిపారు. ఇది నమ్మకాన్ని దెబ్బతీసే పద్ధతి అని ఆమె హెచ్చరించారు.

### సోషల్ మీడియాలో ఆరోగ్య సమాచార వేట

ఇంగ్లాండ్‌లో హెల్త్‌వాచ్ ఇంగ్లాండ్ తరఫున సవాంటా సంస్థ గత ఏడాది 18 సంవత్సరాలు పైబడిన 3575 మంది పురుషులు, 3832 మంది మహిళలపై సర్వే నిర్వహించింది. ప్రతి ఐదుగురిలో ఒకరు ఆరోగ్య సమాచారం కోసం సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నట్లు ఆ సర్వే తేల్చింది. నమ్మదగిన సమాచారాన్ని, వాణిజ్య మోసాలను గుర్తించే నైపుణ్యాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్రంగా మోసపోతున్నారని హెల్త్‌వాచ్ ఇంగ్లాండ్ పాలసీ డైరెక్టర్ విలియం పెట్ తెలిపారు.

### వేదికల బాధ్యతపై తీవ్ర విమర్శలు

ఈ పరిశోధన ఫలితాలు తమ ప్లాట్‌ఫారమ్‌ను కచ్చితంగా ప్రతిబింబించవని టిక్‌టాక్ ప్రతినిధి స్పష్టం చేశారు. హానికరమైన ఆరోగ్య తప్పుడు సమాచారాన్ని, కృత్రిమ మేధ కంటెంట్‌ను తొలగిస్తున్నామని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఎన్‌హెచ్‌ఎస్‌లతో కలిసి నమ్మదగిన సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు.




ఎన్‌హెచ్‌ఎస్ ఇంగ్లాండ్ నేషనల్ మెడికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఫ్రాంకీ స్వోర్డ్స్ మాట్లాడుతూ క్లిక్‌ల కోసం తప్పుడు సలహాలు ఇస్తుండటం కలవరపెడుతోందన్నారు. రాయల్ కాలేజ్ ఆఫ్ జీపీఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ విక్టోరియా ట్జోర్టియో బ్రౌన్ కూడా దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

# పావులా లేక పాడెక్కిన జీవితం

## నటి పావలా శ్యామల కన్నుమూత

- దయనీయ స్థితిలో ఉస్మానియాలో తుదిశ్వాస
- నయా పైస లేక నడిరోడ్డుపైకి చేరిన బతుకు
- కష్టాల్లో ఆదుకోని చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి

తెలుగు తెరపై ఎంతోమందిని నవ్వించిన నటి పావలా శ్యామల ఉస్మానియా ఆసుపత్రిలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో తీవ్రమైన గుండెపోటుతో కన్నుమూశారు. ఒకప్పుడు హాస్యంతో ప్రేక్షకులను అలరించిన నటి చివరి రోజుల్లో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, వృద్ధాప్య సమస్యలతో నడిరోడ్డుపై దిక్కుతోచని స్థితిలో పడిపోవడం, ఆపై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం టాలీవుడ్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది. - సహానం వందే, హైదరాబాద్


క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమెకు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. దాంతో వైద్యులు ఆమె కన్నుమూసినట్లు అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. ఈ విషాద వార్తతో తెలుగు సినీ పరిశ్రమతో పాటు అభిమానులు తీవ్రంగా కలచిపోయారు. ఆమె మరణంపై టాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఈ సంతాపం వ్యక్తం చేసిన వారు ఎవరు కూడా ఆదుకోలేకపోవడం విషాదం.

### దయనీయమైన తుది రోజులు

పావలా శ్యామల గత కొన్నేళ్లుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, వృద్ధాప్య సమస్యలతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. శ్యామలతో పాటుగా ఉన్న ఆమె కుమార్తె మాధవి కూడా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో తనదైన నటనతో ఎంతోమందిని నవ్వించిన నటి, చివరి రోజుల్లో ఇంతటి దయనీయ స్థితిలో కన్నుమూయడం చిత్ర పరిశ్రమను తీవ్రంగా కలచివేస్తోంది. అనారోగ్య భారంతో జీవితం వెళ్లదీస్తున్న తరుణంలో ఆమె పడిన వేదన అంతా ఇంతా కాదు.

### రోడ్డున పడిన వృద్ధ నటి

మూడు నెలల క్రితం పావలా శ్యామల, ఆమె కూతురు మాధవిని హైదరాబాద్ ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి ఆవరణలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. ఇద్దరిని గమనించిన ఆసుపత్రి సిబ్బంది వెంటనే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఛాతీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ ఆదేశాల మేరకు వారిని వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో గడిపిన కాలంలో వారు పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు.


పావలా శ్యామల

### అనాథాశ్రమం నుంచి ఆసుపత్రికి

ఉస్మానియా ఆసుపత్రిలో ఉండలేమని శ్యామల మళ్లీ ఎర్రగడ్డ ఛాతీ ఆసుపత్రికే తిరిగి వచ్చారు. అక్కడి సిబ్బంది బోరబండ పోలీసులకు సమాచారం అందించగా వారిని నగరంలోని అనాథాశ్రమానికి తరలించారు. గతవారం మళ్లీ పావలా శ్యామల గుండె సంబంధిత కారణాలతో ఉస్మానియా ఆసుపత్రిలో చేరారు. నగరంలోని కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. చివరికి ప్రభుత్వ ఆసుపత్రులే ఆమెకు ఆశ్రయమిచ్చాయి.

### కన్నీటి జీవితం...

ఒకప్పుడు వెండితెరపై కళకళలాడిన నటి చివరికి ఆసుపత్రి మంచంపై, అనాథాశ్రమాల చుట్టూ తిరుగుతూ కన్నుమూయడం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరచగా, సినీ ప్రముఖులు నివాళులు అర్పించేందుకు సిద్ధమవుతున్నారు. నటిగా ఎన్నో పాత్రలు వేసిన శ్యామల జీవితం విషాదాంతం కావడం తెలుగు పరిశ్రమకు తీరని లోటు.

# పదేళ్లలోపు చెంప పగులుద్ది

## ఆ వయసు వారికి ఎనర్జీ డ్రింక్స్ నిషేధం

- బ్రిటన్ తరహాలో యోచిస్తున్న కేంద్రం
- ఎనర్జీ డ్రింక్స్ పేరు మార్చాలని ఆదేశం
- రెడ్ బుల్, రిలయన్స్ కాంపా, పెప్సీలకు బ్రేక్
- కంపెనీలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన చర్యలు

శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయంటూ మార్కెట్లో విక్రయిస్తున్న హై కెఫిన్ పానీయాలపై భారత ఆహార భద్రతా నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఉక్కుపాదం మోపింది. ఈ పానీయాలను ఇకపై ఎనర్జీ డ్రింక్స్ అనే పేరుతో అమ్మడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ నిబంధనను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రముఖ కంపెనీలను హెచ్చరించింది. - సహానం వందే, న్యూఢిల్లీ




భారతదేశ ప్రస్తుత ఆహార భద్రతా చట్టాల ప్రకారం ఈ రకమైన హై కెఫిన్ ఉత్పత్తులకు ఎలాంటి నిర్దిష్టమైన ప్రమాణాలు లేవు. ఎలాంటి స్టాండర్డ్స్ లేకుండా ఇష్టానుసారంగా ఎనర్జీ డ్రింక్స్ అని లేబుల్ వేసి అమ్మడం పూర్తిగా చట్టవిరుద్ధం. వినియోగదారులను తప్పుదారి పట్టించేలా ప్రకటనలు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా ప్రమాదంలో పడుతోంది. శరీరాన్ని మనస్సును వెంటనే ఉత్తేజపరుస్తాయని లేదా నీరసాన్ని మాయం చేస్తాయని చెప్పే ప్రకటనలు పూర్తిగా తప్పుదారి పట్టించేలా ఉన్నాయని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం చిన్న నోటీసులతో ఆగకుండా ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించుకున్నారు.

### దిగ్గజ కంపెనీలకు హెచ్చరికలు

పెప్సి, రెడ్ బుల్, మాన్స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ కంపెనీలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఈ కంపెనీలన్నీ కలిసి ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకోవడానికి తెరవెనుక గట్టి ప్రయత్నాలు చేశాయి. భారతీయ బెవరేజ్ అసోసియేషన్ ద్వారా ప్రభుత్వానికి రహస్య లేఖలు రాశాయి. ఇలాంటి ఆకస్మిక నిర్ణయాలు తీసుకుంటే తమ బ్రాండ్ పేరు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశాయి. మార్కెట్లో తీవ్ర గందరగోళం ఏర్పడుతుందని వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని వాదించాయి.

### లాబీయింగ్ విఫలం

కంపెనీల ఈ లాబీయింగ్ ఏమాత్రం పనిచేయలేదు. ఇటీవల జరిగిన ఒక అత్యవసర సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజిత్ పున్హాని కంపెనీల వాదనలను పూర్తిగా తోసిపుచ్చారు. వ్యాపారాల నష్టాల గురించి తాము ఆలోచించబోమని మీకు ఏమాత్రం అభ్యంతరం ఉన్నా నేరుగా కోర్టును ఆశ్రయించుకోవచ్చని తెగేసి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేయడంతో దిగ్గజ కంపెనీలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తీసుకున్న ఈ దూకుడు నిర్ణయంతో కంపెనీలు చివరికి తలవంచక తప్పలేదు.

### దాడులు... ఆన్ లైన్ ఆంక్షలు

ఈ లోపు తమ ఉత్పత్తుల మీద ఉన్న ఆ పేర్లను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఇప్పటికే రాజస్థాన్ లాంటి కొన్ని రాష్ట్రాల్లో వేలాది సంఖ్యలో స్టింగ్, కాంపా ఎనర్జీ, రెడ్ బుల్ బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకుని దాడులు ప్రారంభించారు. ఈ ప్రభావం కేవలం రిటైల్ దుకాణాల మీదే కాకుండా ఆన్ లైన్ మార్కెట్ల మీద కూడా గట్టిగా పడింది. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, బ్లింకిట్, స్విగ్గీ ఇన్ స్టామార్ట్ లాంటి ప్రముఖ ఈ కామర్స్ కంపెనీలకు కూడా ప్రభుత్వ వర్గాలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. తమ ప్లాట్ ఫారమ్ లలో ఏ ఒక్క ఉత్పత్తిని కూడా ఎనర్జీ డ్రింక్ అనే పేరుతో ప్రమోట్ చేయడానికి వీల్లేదని హెచ్చరికలు జంపాయి.

### పదేళ్ల లోపు వారికి నిషేధం...

ఈ ఎనర్జీ డ్రింక్స్ లో అధిక మోతాదులో కెఫిన్, చక్కెర, టౌరిన్ అనే అమైనో ఆమ్లం ఉండటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచంలోని పలు దేశాలు వీటిపై కఠినమైన ఆంక్షలు విధిస్తున్నాయి. బ్రిటన్ లాంటి దేశాలు రాబోయే సంవత్సరంలో పదేళ్ల లోపు పిల్లలకు ఇలాంటి డ్రింక్స్ అమ్మడాన్ని పూర్తిగా నిషేధించడానికి సిద్ధమవుతున్నాయి. మన దేశంలో కూడా అదే బాటలో అడుగులు పడుతున్నాయి. రోజూ పొగతాగే సమయంలో లేదా నీరసంగా ఉన్నప్పుడు ఇలాంటి డ్రింక్స్ తాగడం అలవాటు చేసుకున్న చాలామంది యువకులు వీటికి బానిసలవుతున్నారు. క్షణంలో శక్తి వస్తుందనే భ్రమలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పుడు తీసుకున్న ఈ కఠినమైన నిర్ణయం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రకటనలకు అడ్డుకట్ట వేయాలని చూస్తోంది.